క్లుప్తంగా

రేపే వెంకటేశ్వర స్వామి వారి కల్యాణం

పిడుగురాళ్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 5వ తేదీన ఆదివారం వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు యేలూరి రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు జరుగుతాయని, ఉదయం 10 గంటలకు వేదపండితులచే నిర్ణయించిన దివ్య ముహుర్తమున స్వమివారి కల్యాణం వైభవంగా జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఐదు గంటలకు స్వామి వారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తారని వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవం



తేరుపై తిరుకుటుంబ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రెంటచింతల: కానుకమాత చర్చి 173వ వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి 10.30 నుంచి శుక్రవారం ఉదయం 8.30 వరకు గ్రామపురవీధుల్లో కథోలికులు భక్తిశ్రద్ధలతో కానుకమాత తేరోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై తిరుకుటుంబ విగ్రహంతో కానుకమాత చర్చినుంచి బ్రహ్మయ్య బావిసెంటర్, ఉట్లస్తంబాల సెంటర్, తిరుహృదయ మందిరం, లూర్దుమాత గుడి మీదగా సుమారు 10 గంటల పాటు మేళతాళాలతో భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగించారు.

వారబంది విధానంతో చివరి ఆయకట్టుకు సాగునీరు

పిడుగురాళ్ల: వారబంది విధానంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తున్నామని ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.శ్రీనివాసరావు పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలకల్లు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంగెడ, ఆకురాజుపల్లి మేజర్ కాలువల్లో వారబంది విధానం ద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. సాగునీరు సరిపడా అందడంలేదని కానీ, పంట నష్టం జరుగుతుందని కానీ రైతుల నుంచి తమకు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. సక్రమంగా రైతులకు వారబంది విధానం ద్వారా నీరు అందించడం వల్ల రైతులు వారికి సాగునీరు అందే సమయంలో క్రమశిక్షణగా ప్రతి ఒక్కరూ పంటలకు సాగునీటిని ఉపయోగించుకుంటున్నారు. తద్వారా ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు సరఫరా అవుతుందని, అందుకే రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. సాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే రైతులు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

ఎంపీపీగా అల్లు సత్యవతి ఎన్నిక



పిడుగురాళ్లరూరల్: మండల పరిషత్ అధ్యక్షురాలుగా అల్లు సత్యవతిని శుక్రవారం ఎంపీటీసీలు మండల పరిషత్ కౌన్సిల్ మీటింగ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, పల్నాడు జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ సీహెచ్ ఆంజనేయులు సమక్షంలో తుమ్మల చెరువు-2కు ఎన్నికైన అల్లు సత్యవతి ఎంపీపీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్‌ను అయ్యప్పనగర్ ఎంపీటీసీలు గొట్టిముక్కల మట్టారెడ్డి ప్రతిపాదించగా, పందిటివారిపాలెం ఎంపీటీసీ కె. కోటేశ్వరరావు బలపరిచారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. ప్రత్యేకాధికారి సీహెచ్ ఆంజనేయులు ఎంపీపీగా ఎన్నికైన అల్లు సత్యవతిని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాశయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు గార్లపాటి అనసూర్య, సాతులూరి బాబు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ లబ్ధిని మహిళకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అడిగొప్పలలో మూడవ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మూడవ రోజు కార్యక్రమం ముగిసే సమయానికి 876 మంది లబ్ధిదారులను కలిసి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించిన ప్రతి రూపాయిని రికార్డ్స్ రూపంలో వారికి తెలియజేయడం గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి మహోన్నత కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ చేస్తోందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాకి లెక్కలు చెప్పి ప్రజలను నిలువునా దోచుకున్నారన్నారు. టీడీపీలోనే పెద్దలు ప్రజాధనాన్ని లూటీ చేశారన్నారు. మాజీ సీఎం చంద్రబాబు ఈ రోజు మొసలి కన్నీరు కారుస్తూ కల్లిబిల్లి మాటలు చెబుతున్నారని వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లోకేష్ పాదయాత్ర కేవలం తన ఉనికిని కాపాడుకోవడానికినని మాత్రమేనని ఎద్దేవా చేశారు. మన ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం విప్లవాత్మక పద్ధతులు దేశంలో మరే రాష్ట్రంలో లేవని వివరించారు.

గడప గడపలో ఘన స్వాగతం...

ప్రతి లబ్ధిదారున్ని ఇంటికి వెళ్లిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం పార్టీకి బలమైన గ్రామము అడిగొప్పలలోపే ఆర్కెకు స్థానిక ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. ప్రతి గడపకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి వారి ఆదరణకు కారణమైంది. ఓటు బ్యాంకుగా ఉన్న బలమైన సామాజిక వర్గం నుంచి లభిస్తున్న ఆదరణ పట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులలో ఉత్సాహం నెలకొనింది. టీడీపీకి చెందిన చాలా మంది నాయకులు లబ్ధిదారులుగా ఉన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచ్ నాలి రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, వైస్ ఎంపీపీలు చల్లా శ్రీనివాసరావు, ఊరబండి ఏగయ్య, నాయకులు నలబోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, జంగా యలమంద, సంకురాత్రి సీతయ్య, తోట వాసు, గర్నె లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ కొనకంచి బాలు, ఉన్నం పెద్దబ్బాయ్, కటకం చిన వెంకటయ్య, జక్కా రమేష్, తోటకూర వెంకటేశ్వర్లు, రాయపాటి నాగేశ్వరరావు, కోట బ్రహ్మం, మాచర్ల జార్జి, నాగెండ్ల లక్ష్మీనారాయణ, షేక్ జానీ, దారెడ్డి లక్ష్మారెడ్డి, సంక్రాంతి గురువులు, పెరుగు శివకృష్ణ, నాగుల్ మీరా, చిలకల అంజిరెడ్డి, తలపరు కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : వైఎస్సార్ సీపీ పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కర పత్రాలను అందజేశారు ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా పేదల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హత ప్రమాణీకంగా సంక్షేమ పథకాలు అందించడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హత ఉండి సాంకేతిక సమస్యలతో పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లని అన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలన్నారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా కాశీబాబు, మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, వి పద్మ, మాజీ జెడ్పీటీసీ బి ఇష్ట కామిరెడ్డి, సీనియర్ నాయకుడు పోలు వెంకటరెడ్డి,సీహెచ్ లక్ష్మణ్, వి అమరారెడ్డి, చలవాది నారాయణ, షేక్ నాగులుమీరా, షేక్ నాసర్‌సైదా, కో ఆప్షన్ మెంబర్ పీర్ అహ్మద్, విప్ కె అనిల్‌కుమార్, కనకం ఆదినారాయణదత్తు తదితరులున్నారు.

చైర్‌పర్సన్‌గా సుబ్బమ్మ ఏకగ్రీవ ఎన్నిక



చైర్‌పర్సన్‌గా ఎన్నికైన కోప్పుల సుబ్బమ్మకు ఎన్నికపత్రం అందజేస్తున్న ఆర్డీఓ అద్దయ్య, ఎమ్మెల్యే

దాచేపల్లి : నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా కోప్పుల సుబ్బమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ అధికారి, గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చైర్‌పర్సన్ ఎన్నిక శుక్రవారం జరిగింది. 10వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కోప్పుల సాంబయ్య భార్య సుబ్బమ్మను చైర్‌పర్సన్ అభ్యర్థిగా 1వ వార్డు కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్ బలపర్చగా, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం పోలు, స్వతంత్ర కౌన్సిలర్ షేక్ షరీఫ్ బలపరిచారు. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లందరూ ఏకగ్రీవంగా సుబ్బమ్మను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సుబ్బమ్మకు ఎన్నిక పత్రం అందజేసిన ఆర్డీవో అద్దయ్య ప్రమాణస్వీకారం చేయించారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చైర్‌పర్సన్ సుబ్బమ్మను శాలువా, పూలదండలతో సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో నగర పంచాయతీలో అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలను పొందుతామని చైర్‌పర్సన్ సుబ్బమ్మ చెప్పారు. అనంతరం స్థానిక బొడ్రాయి, శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో ఎమ్మెల్యే కాసు, చైర్‌పర్సన్ సుబ్బమ్మ ప్రత్యేకంగా పూజలు చేశారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ బ్రహ్మానాయుడు, వైస్‌చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్ రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు చైర్‌పర్సన్ సుబ్బమ్మ, సాంబయ్యను సన్మానించారు. మొట్టమొదటి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన మునగా రమాదేవి మృతిచెందడంతో ఈ ఎన్నికను అధికారులు నిర్వహించారు.

టీడీపీ, జనసేన గైర్హాజర్...

నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి టీడీపీ, జనసేన కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీకి 11మంది కౌన్సిలర్లు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, టీడీపీ 07, జనసేన 01 చొప్పున కౌన్సిలర్లు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కు ఉంది. చైర్‌పర్సన్ ఎన్నికకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లందరూ, స్వతంత్ర కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం జరుగుతున్న చైర్‌పర్సన్ ఎన్నికకు టీడీపీ, జనసేన కౌన్సిలర్లు రాకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపల్‌గా రంగాచారి



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా జి రంగాచారి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పాటుపడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటివరకు కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన చందూ ఆంజనేయులు కామర్స్ అధ్యాపకులుగా విధులు నిర్వహించనున్నారు. నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యలు స్వీకరించిన రంగాచారిని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

మాచవరం: రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించి, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచుల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించి పరిష్కరించాలని సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ప్రభుత్వాన్ని కోరారు. పర్యటనలో భాగంగా మండలంలోని మోర్జంపాడు గ్రామానికి విచ్చేసారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామాలకు కేటాయిస్తున్న నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, జాస్తి రంగారావు,జిల్లా అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, ఉయ్యూరు అప్పిరెడ్డి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

గురజాల : అనుమానస్పద స్థితిలో మృతిచెందిన మృతుడి ఆచూకి లభ్యమైనట్లు సీఐ కె ప్రభాకర్ సూచించారు. పులిపాడు రోడ్డు వద్ద గల వెంచర్‌లో గోడ సమీపంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన మృతదేహం విషయం పాఠకులకు విధితమే. తెలిసిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన వృద్ధాశ్రమంలో గత 15 సంవత్సరాలుగా ఉంటున్న దున్నా సుబ్బారెడ్డి (74) మృతదేహంగా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. సుబ్బారెడ్డి మానసికంగా ఇబ్బందులు పడుతుండే వాడని బయటకు వెళ్లి వారం రోజుల పాటు రాకుండా అక్కడక్కడ వుండేవాడని సమాచారం. పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారెంపూడి కాపులకు ప్రభుత్వ విప్ పీఆర్కే వరాలు

- కల్యాణ మండపానికి రూ. కోటి విలువైన స్థలం
- కమ్యూనిటీ హాలుకు రూ.20 లక్షలు
- కల్యాణ మండపానికి రూ.25 లక్షల గ్రాంటు



శంకుస్థాపన స్థలంలో పోలేరమ్మ చిత్రపటానికి నమస్కరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

కారెంపూడి: శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం కల్యాణ మండపం నిర్మాణానికి రూ కోటి విలువైన 40 సెంట్ల స్థలాన్ని కేటాయించడంతో పాటు నిర్మాణానికి మరో రూ.25 లక్షల గ్రాంటు, అలాగే పోలేరమ్మ గుడి స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షల గ్రాంటు మంజూరు చేయడం జరిగిందని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. కారెంపూడిలో దాచేపల్లి రహదారి పక్కనే కాపు కల్యాణ మండపం నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో పోలేరమ్మ తల్లి గుడి స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రభుత్వ విప్ పీఆర్కే శంకుస్థాపన చేశారు. ముందుగా పోలేరమ్మ తల్లి, పాత పాటేశ్వరమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని పెద్దలు అడిగిన వెంటనే విగ్రహం ఏర్పాటుకు అన్ని అనుమతులు ఇప్పించడం జరిగిందన్నారు. స్వర్గీయ వంగవీటి మోహనరంగా స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డిగారి రాజకీయ శిష్యుడుగా రాజశేఖర్‌రెడ్డిగారి కుటుంబాన్ని అత్యంత అభిమానించి ప్రేమించిన వ్యక్తిగా ఉన్నారన్నారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డిగారిని అభిమానించి ఆయన అడుగుజాడలలో కాపులు నడిచారని తాను కూడా వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ అందరి అభిమానంతో ఈ స్థాయికి వచ్చానన్నారు. మొదటి నుంచి కాపులు వైఎస్సార్‌కు అండగా ఉన్నారని కష్టకాలంలో కూడా ఆయన వెన్నంటే నడచారని చెప్పారు. కాపుల మనోభావాలు దెబ్బతినకుండా తనకు చేతనైన సాయం అందిస్తానని ప్రభుత్వ విప్ పీఆర్కే స్పష్టం చేశారు. కల్యాణ మండపం అభివృద్ధి చేస్తే అదే రెండు కోట్ల రూపాయల ఆస్తి అవుతుందని, అది భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్నారు. కాపు సంఘం పెద్దలు పలిశెట్టి కోటేశ్వరరావు (మునసబు), డాక్టర్ ఎం సత్యనారాయణ, బొమ్మిన కొండ, కిల్లా చెన్నయ్య, బొమ్మిన అల్లయ్య, పెదకాపు బొమ్మిన శ్రీను, బొమ్మిన హనుమయ్య, కిల్లా కాశి ,తోట శ్రీను, రంగా, జక్కా నరసింహారావు, పలిశెట్టి వెంకటేశ్వర్లు, రెస్టారెంట్ సుబ్బారావు, కోడె రమేష్, పెనుగొండ్ల గోవిందయ్య, సర్పంచ్ ప్రమీలాభాయి తేజనాయక్, ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కేకు ముఖ్యంగా కాపు మహిళలు ఘన స్వాగతం పలికారు.

ప్రజలకు జవాబు దారీగా ఉండాలి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఎంపీపీగా ఎన్నికైన అల్లు సత్యవతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: పదవి అలంకారం కాదని, ఎన్నిక కాబడిన అభ్యర్థులు ప్రజలకు జవాబు దారిగా ఉండాలని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నికలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎన్నిక కాబడిన ఎంపీపీ అల్లు సత్యవతి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సాదరంగా ఎంపీపీ కార్యాలయానికి ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పదవి అలంకరణ కాదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మనపై పెట్టిన గురుతర బాధ్యత అని, ప్రజా సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అడుగులు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రు నిరామిరెడ్డి, అల్లు పిచ్చిరెడ్డి, కత్తెరపు రాం గోపాల్ రెడ్డి, వాసుదేవరెడ్డి, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పట్టాలను ఆన్‌లైన్ చేయాలి

మండల ప్రత్యేక అధికారి గబ్రునాయక్



గురుకుల బాలికల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి గబ్రునాయక్

విజయపురిసౌత్: గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను ఆన్‌లైన్ చేయాలని మాచర్ల మండల ప్రత్యేక అధికారి గబ్రునాయక్ అన్నారు. విజయపురిసౌత్లోని హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి కింద గృహ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. విజయపురిసౌత్‌లో 454 పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. మరో 80 మందికి లేఅవుట్ డెవలప్ చేయాల్సి ఉందన్నారు. అనంతరం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సందర్శించి భోజన వసతులను పరిశీలించారు. అలాగే పీటీజీ పాఠశాలలో తనిఖీ నిర్వహించి భోజన వసతులను పరిశీలించి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని పరిశీలించి సచివాలయంలోని సిబ్బంది యూనిఫామ్ తప్పకుండా ధరించాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది ఆన్‌లైన్ అటెండెన్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో 80 శాతం మాత్రమే హాజరు శాతం కనిపిస్తోందని మిగిలిన 20 శాతం హాజరు పరిస్థితి ఏమిటి అని సిబ్బంది ద్వారా వివరణ తీసుకున్నారు. ఆయన వెంట మాచర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓ కోటేశ్వరావు, ఎంఈఓ నాగయ్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎలక్ట్రికల్ ఏఈ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, వీఆర్వోలు శ్రీను, విఘ్నేష్, వెల్ఫేర్ ఆఫీసర్ భవాని, డిజిటల్ అసిస్టెంట్ క్రాంతిరేఖ, ఏఎన్ఎం కుమారిబాయి సిబ్బంది ఉన్నారు.

రోడ్డు నిర్మాణ భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పిడుగురాళ్ల: పట్టణంలోని కొండమోడు సమీపంలో పులిచింతల పునరావాస కేంద్ర సమీపంలో రోడ్డు విస్తరణలో కోల్పోయే భూములను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. కొండమోడు నుంచి పేరేచర్ల వరకు రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణలో కలవనున్న పిడుగురాళ్ల శివారు సుమారు 15 నుంచి 20 ఎకరాల భూములను ఆయన పరిశీలించడం జరిగింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం భూయజమానులతో కూడా మాట్లాడేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ నవాజ్, తహసీల్దార్ చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

రెంటచింతల: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి మల్లవరపు భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ ఉన్నత పాఠశాలను ఆయన మండల స్థాయి అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠశాలలో కల్పించిన వసతులను పరిశీలించి అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి రోజు మెను ప్రకారం భోజనం పెడుతున్నారా. మీ పట్ల ఉపాధ్యాయులు ఎలా ఉంటున్నారు అని అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తి పై దాడి

దుర్గి: మండల పరిధిలోని ఓబులేశుని పల్లె గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి పై దాడి జరిగిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గురువారం రాత్రి కొట్టారు. సైదారావు పై బంధువులైన నాగనబోయిన కోటేశ్వరరావు, నాగనబోయన వెంకటేశ్వర్లు, ఇరువురు అన్నదమ్ములు దాడి చేసి గాయ పరిచినట్లు బాధితుడు సైదారావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోలిలో పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన



గోలిలో పీహెచ్‌సీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోలి(రెంటచింతల): మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య కేంద్రాల్లో భాగంగా మండలంలోని గోలి గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణం చేపడుతున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి మల్లవరపు విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, గురజాల ఆర్డీఓ అద్దెయ్య ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డిలతో కలిసి గోలి గ్రామంలోని సచివాలయం సమీపంలో ఉన్న సర్వే నంబర్ 261-8-1సి2లో 1.50 ఎకరాల భూమిని పరిశీలించారు. గోలి గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణం చేపడితే జెట్టిపాలెం, పశర్లపాడు, మల్లవరం, సత్రశాలలో ఉన్న వేలాది మంది ప్రజలకు వైద్యపరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. త్వరలోనే ఇక్కడ పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మున్నా చంద్రశేఖర్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో పాశం నాసర్‌రెడ్డి, హెల్త్‌సూపర్ వైజర్ పూజల నాగేశ్వరరావు తదితరులున్నారు.